www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025
5
కాకినాడ



నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో తుపాను ప్రభావం తగ్గడంతో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలలోని అన్ని పాఠశాలలు గురువారం నుంచి యథావిధిగా పూర్తిస్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. తుపాను పునరావాస కేంద్రం నిర్వహణ నిమిత్తం పాఠశాల ఆవరణ కేటాయించిన సందర్భంలో సదరు సచివాలయ, పంచాయతీ, మునిసిపల్ అధికారుల సహకారంతో పారిశుధ్య నిర్వహణ చేయాలన్నారు. పాఠశాల పరిసరాలలో ఎక్కడైనా పాత భవనాలు, శిధిలావస్థలో ఉన్న భవనాలు, వర్షపు నీరు లీక్ అయ్యే భవనాలు ఉంటే వాటి పరిసరాలలోనికి విద్యార్థులు ఎవ్వరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అటువంటి చోట తరగతులు నిర్వహించ రాదన్నారు.

మొంథా మిగిల్చిన నష్టం

-40 వేల ఎకరాల్లో నీట మునిగిన వరి

-దెబ్బతిన్న 55 నివాస గృహాలు

-కొనసాగుతున్న విద్యుత్ అంతరాయం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మొంథా తుపాను కోనసీమ ప్రాంతంలో తీరం దాటడంతో కాకినాడ జిల్లా వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే తుపాను ప్రభావంతో మంగళవారం భారీగా వీచిన గాలులు, ఎడతెరిపిలేని వర్షాలతో పలుచోట్ల వరి పంట పూర్తిగా నీట మునిగింది. ఏలేరు నుంచి అదనపు జలాలు విడుదల చేస్తుండడంతో పిఠాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో వరికి నష్టం ఎక్కువగా జరిగే అవకాశం కనిపిస్తుంది. అయితే ప్రస్తుతం తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వలన సామర్లకోట, కాజులూరు, పెదపూడి, కాకినాడ రూరల్, తాళ్లరేవు, కరప తదితర 20 మండలాల పరిధిలోని 222 గ్రామాల్లో 10,374 మంది రైతులకు చెందిన 42,930 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఇందులో 40,655 ఎకరాలలో వరి, 1700 పత్తి, 480 ఎకరాల్లో మినుములు, 72 ఎకరాల్లో మొక్కజొన్న, 30 ఎకరాల్లో రాగులు పంటలు నీటమునిగాయి. అయితే ఈ లెక్కలు అధికారుల ప్రాథమిక అంచనా మాత్రమే. రెండు రోజులు గడిస్తేనే గాని పూర్తిస్థాయిలో నష్టం అంచనాలు వేయలేమని వ్యవసాయ శాఖ చెబుతోంది. పంట నష్టం అంచనాలు త్వరితగతిన చేపట్టి పరిహారాలను తక్షణమే విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే క్రాఫ్ ఇన్సూరెన్స్ పథకం సక్రమంగా అమలు కాకపోవడంతో ముఖ్యంగా కౌలు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

దెబ్బతిన్న గృహాలు

తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 55 నివాస గృహాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాకినాడ రూరల్ మండలంలో 4, అర్బన్‌లో 5, తాళ్ళరేవు 8, కాజులూరు 2, సామర్లకోట 7, పిఠాపురం 3, యు.కొత్తపల్లి 8, కిర్లంపూడి 4, తొండంగి 2, పెద్దాపురం 10, జగ్గంపేట, కోటనందూరులలో ఒక్కో గహం దెబ్బతిన్నాయి. ఇళ్లు కోల్పోయి నిరాశ్రాయిలుగా మిగిలామని, ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి. ప్రధానంగా తీరాన్ని ఆనుకుని ఉన్న మత్స్యకార గృహాలు సముద్రంలో కలవడంతో తాము ఎక్కడ నివసించాలి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాక్షిక నష్టం

తుపాను ప్రభావంతో జిల్లాలోని రోడ్లుకు పాక్షిక నష్టం జరిగింది. 44 కిలోమీటర్ల మేరకు రోట్లు దెబ్బతిన్నాయి. వివిధ ప్రాంతాలలో 73 చెట్లు, భారీ వృక్షాలు నేలకొడిగాయి. పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడడంతో సిబ్బంది పునరుద్ధరణ పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ పునరుద్ధరణ పనులు జరుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ కోతలు కొనసాగాయి. రెండు రోజుల నుంచి మొబైల్ నెట్‌వర్క్‌లు సక్రమంగా పని చేయలేదు. దీంతో అనేకమంది వినియోగదారులు అవస్థలు పడాల్సి వచ్చింది.

వేట లేక పూట గడవక..

తుపాను ప్రభావంతో గత వారం రోజుల నుంచి జిల్లాలోని తీర ప్రాంతం మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లడం లేదు. దీంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరో రెండు రోజులపాటు వేటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మత్స్యకారులు ప్రభుత్వ సాయం కోసం నిరీక్షిస్తున్నారు. తుపాను ప్రభావం తగ్గడం, పునరావాస కేంద్రాల్లో అరకొరగానే ఏర్పాట్లు చేయడంతో బుధవారం ఉదయమే పలువురు బాధితులు ఇళ్ళకి చేరుకున్నారు.

బీచ్ రోడ్డుకు రక్షణ కరువు

గత ఎన్నికలలో కూటమి పెద్దలు కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు రక్షణ కోసం అనేక హామీలను ఇచ్చారు. ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ నేటికీ అమలు కోసం ఒక్క అడుగు ముందుకు వేయలేదు. దీంతో తుపాను ప్రభావం వలన ఉప్పాడ కాకినాడ బీచ్ రహదారి మరోసారి పూర్తిగా దెబ్బతింది. రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఎంత పెద్ద స్థాయిలో నష్టం జరిగే అవకాశం లేదని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చి బీచ్ రోడ్డు రక్షణ, అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాలని కోరుతున్నారు.

నిరాశ్రాయిలుగా మిగిలాం

తుపాను వల్ల పెద్ద పెద్ద గాలులు వచ్చాయి. భయపడి బయటకు పరుగులు తీశాము. కొంతసేపటికి మా ఇల్లు సముద్రంలో కలిసిపోయిందని తెలిసింది. ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలాము. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. తాత్కాలికంగా నివాసం ఉండేందుకు ఏర్పాటు చేయాలి.

-పరమల్ల లచ్చన్న, ఇల్లు కోల్పోయిన బాధితుడు, ఉప్పాడ

మత్స్యకారులను ఆదుకోవాలి

గత వారం నుంచి వేట లేదు. కాలుష్యం కారణంగా గతంలో 15 రోజులు పాటు వేటకు వెళ్ళలేదు. మత్స్య సంపద లభ్యం కాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాము. ప్రస్తుతం తుపానుకారణంగా ఉపాధి కోల్పోయాము. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

-ఆరి చినశ్రీను, ఉప్పాడ

రక్షణ చర్యలు ఏవి.?

ఉప్పాడ బీచ్ రోడ్డు రక్షణ లేకపోవడంతో తరచూ నష్టాలను ఎదుర్కొంటున్నాము. గతంలో ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ బీచ్ రోడ్డును అభివృద్ధి చేస్తామంటూ హామీ ఇచ్చారు. నేటికీ అమలు చేయలేదు. తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలి.

- తీరంశెట్టి శ్రీను, ఉప్పాడ



రైతులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

పూడికలు తీయించండి సారూ...

ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ముంపు పొలాల రైతులు

ప్రజాశక్తి - అమలాపురం

పొలాల నుంచి మురుగు వెళ్లే డ్రెయిన్లు పూడుకు పోవడంతో తరచూ ముంపునకు గురవుతున్నామని, వెంటనే పూడికలు తీయించండి సారూ... అంటూ ముంపునకు గురైన రైతులు సిఎం చంద్రబాబును వేడుకున్నారు. బుధవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో సిఎం చంద్రబాబు పర్యటించారు. తొలుత తుపాను బాధిత ప్రాంతల్లో ఆయన ఏరియల్ సర్వే చేశారు. అనంతరం ఓడలరేవులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. తుపాను బాధితులతో మాట్లాడారు. అందుతున్న వసతులపై ఆరా తీశారు. నిర్వాసితులకు ఆర్థిక సాయం అందించారు. బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తరువాత బెండమూరిలంక శివారు ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను ఏకరువు పెట్టారు. తమకు సాగునీరు ఆలస్యంగా విడుదలవుతుందన్నారు. ముందుగానే విడుదల చేస్తే తమ పంటలను తుపానుల నుంచి కాపాడుకోగలుగుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా మురుగు నీటి డ్రెయిన్లు పూడుకు పోయాయని, ఫలితంగా వర్షాలు, వరదల సమయంలో పొలాల్లో నీరు దిగక ముంపునకు గురవుతున్నామని వాపోయారు. పూడికలు తీయిస్తే తమ పొలాలు ముంపు నుంచి బయటపడతాయని ముక్తకంఠంతో కోరారు. దీనిపై సిఎం మాట్లాడుతూ సన్న రకం వరి వంగడాలు వేయాలన్నారు. తమ ప్రాంతానికి సన్న రకాలు పెద్దగా దిగుబడిని ఇవ్వవని రైతులు తెలిపారు. భూసారాన్ని బట్టి స్వర్ణ రకమే మంచి దిగుబడిని ఇస్తుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి శాస్త్రవేత్తలతో మాట్లాడారు. సన్నాల వరి వంగడాలు సాగు చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పంట నష్టాలను త్వరగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



తుపాను బాధితులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

ఈ సందర్భంగా సిఎం మాట్లాడారు. నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. పంటలపై బీమా ప్రీమియం చెల్లించి ఉంటే అది కూడా అందేలా చూస్తానన్నారు. జిల్లాలో నష్టం వాటిలినప్పటికీ పెనుముప్పు నుంచి బయట పడిందన్నారు. తుపాను బాధితులకు, రైతులకు సర్కారు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తుపాను వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, నేతన్నల కుటుంబాలకు రూ.5వేల చొప్పున పరిహారం అందిస్తామన్నారు. బియ్యం, ఇతర నిత్యావసరాలు అందిస్తామన్నారు. ఆయన వెంట మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ హరీష్‌మాథూర్, ఎంఎల్‌ఎలు ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, ప్రత్యేక అధికారి వి.విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జెసి నిశాంతి, డిఆర్‌ఒ కె.మాధవి తదితరులున్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని పి.మల్లవరం, సుంకటరేవు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంట నష్టంపై వారికి వివరించారు. పొట్ట వచ్చి ఈనిన చేలల్లో కూడా పువ్వురాలి పోయిందని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టాన్ని లెక్కించేందుకు వచ్చే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కోరారు. రైతులను వ్యక్తిగతంగా కలిసి నష్టాన్ని అంచనా వేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎవరైతే సాగు చేస్తున్నారో ఆ రైతులకే నష్ట పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పలివెల సింహాచలం, కడలి రాంబాబు, అయినవిల్లి వాసు, పలివెల శేషారావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఈశ్వరరావు

సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎపి మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం పగడాల పేట, దుమ్ములపేట, ఉప్పలంక తదితర ప్రాంతాలలో తుపాను పునరావాస సెంటర్‌లను సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు యు.సత్యనారాయణ, జాతీయ నాయకురాలు సిహెచ్.రమణి మాట్లాడారు. తుపాను సెంటర్లో ఉన్న మత్స్యకారులందరూ రేకుల షెడ్‌లో నివాసం ఉంటున్నారని, తుపాను సమయంలో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని కాలం గడుపుతున్నారని అన్నారు. ప్రతీ ఏడాది తుపానుల ప్రభావంతో వేట లేక ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వేటకు వెళ్లని మత్స్య కార్మికులకు రూ.10 వేలు, నిత్యావసర వస్తువులు అందించి ఆదుకోవలని కోరారు. కుంభాభిషేకం వద్ద సముద్రంలో గల్లంతైన యువకుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ పర్యటనలో ఐద్వా జిల్లా అధ్యక్షులు జి.భూలక్ష్మి, చోడిపల్లి సాయికిరణ్, కొయ్య సింహాద్రి, సూరడా వీరబాబు, ఎరుపల్లి దాసు, సిహెచ్.రాజు, కె.సత్తిబాబు పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న రమణి

పంట నష్ట గణనకు ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో మొంథా తుపాను సంభవించిన నష్టాన్ని గణన చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో తుపాను సహాయక కార్యక్రమాలు, తుపాను వల్ల సంభవించిన నష్టం గణనపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. జిల్లా యంత్రాంగం మంచి స్పూర్తితో పని చేసిందని అన్నారు. అదే స్ఫూర్తితో తుపాను అనంతరం సహాయక కార్యక్రమాలను ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగని రీతిలో చేపట్టాలన్నారు. వాటితో పాటు ఆస్థి, పంట, పశు నష్టం అంచనాలను ఈనెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాల అనంతరం జిలాల్లో ఎక్కడా అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాలు, పట్టణ, నగరాలలో పూర్తి పారిశుద్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నదులు, చెరువులు, వాగులు, కాలువల గట్ల పటిష్టతను పరిశీలించాలని, బలహీనంగా గట్లను పటిష్టం చేయాలన్నారు. జిల్లాలో 401 తుపాను సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, 35,114 మందికి భోజన, వసతి సదుపాయాలు కల్పించామన్నారు. బాధితులకు మనిషికి రూ.1000 చొప్పున గరిష్టంగా కుటుంబానికి రూ.3 వేలు అందించాలని అధికారులను ఆదేశించారు. పునరావస కేంద్రాల్లోఉన్న కుటుంబానికి 25 కేజీలు బియ్యం (మత్స్యకారులకు 50 కేజీలు,) ఒక కిలో పప్పు, ఒక లీటర్ వంటనూనె, ఒక కిలో ఉల్లిపాయలు, ఒక కిలో బంగాళదుంపలు, ఒక కిలో చక్కెర అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో పంట నష్టాల అంచనాలను ఈనెల 30వ తేదీ లోగా పూర్తిచేయాలని, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో వారి శాఖలను సంబంధించి పంట నష్టాలను పరిశీలించి వెంటనే నివేదికలను సమర్పించాలన్నారు. జిల్లాలో తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే పునర్నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ వెంకటరావు, వ్యవసాయ, మత్స్య శాఖ అధికారులు ఎన్.విజయ్‌కుమార్, పి.కృష్ణారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులానాయక్, డిఎస్‌ఒ ప్రసాద్‌రావు, ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, పాడా పీడీ చైత్రవర్షిణి, ఎస్‌బి డిఎస్‌పి సత్యనారాయణ, చేనేత శాఖ ఎడి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఏలేరు ఆధునికీకరణకు కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేరు ఆధునికీకరణకు కృషి చేస్తామని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ అన్నారు. బుధవారం ఆయన బుధవారం ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభతో కలిసి ఏలేరు రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను సందర్భంగా సహాయక చర్యలు చేపట్టిన అధికారులను సిబ్బందిని అభినందించారు. రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు ఎప్పటికప్పుడు వాయిదాలు పర్వం కొనసాగుతుందని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఎల్‌ఎ సత్యప్రభ మాట్లాడుతూ రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టిందని, దీంతో నీటిని విడుదలను క్రమేపి తగ్గిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జడ్‌పి మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, కూటమి నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, జ్యోతుల పెద్ద బాబు, అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, చిక్కాల లక్ష్మణరావు, బద్ది రామారావు పాల్గొన్నారు.



వివరాలను తెలుసుకుంటున్న ఎంపి సానా సతీష్

రైతులను ఆదుకునేలా చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు

తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వళ్ల రాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని శీలలంక, కాజులూరు, సేదువాడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులను కలుసుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వరి పంట నేలనంటిందని అన్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టారని, కావున ప్రభుత్వం తక్షణమే పంట నష్టం అంచనా వేసి ప్రతి సాగుదారునికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్డుతో సంబంధం లేకుండా ప్రతి కౌలు రైతులను గుర్తించి నమోదు చేసి పంట నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో పలువురు రైతులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం రూ.30 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కరప

తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని గొర్రిపూడి, పెనుగుదురు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం తుపాను నష్టంపై సర్వేను నిర్వహించాలని, నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్ట పరిహారాన్ని చెల్లించాలని కోరారు. ఈ పర్యటనలో నాయకులు యాగంటి సత్యనారాయణ, వారా కోదండరాం, ఎం.శ్రీనివాస్, గణపతి, వెంకట రమణ పాల్గొన్నారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - కోటనందూరు

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కోరారు. బుధవారం తొండంగి మండలం పెనుమళ్ళపురం గ్రామంలో ఆయన పర్యటించారు. వరద బాధితులు, మత్స్యకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం పరిహారాలు అందించాలని, పునరావస కేంద్రాల్లో మెరుగైన వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు.

శిథిలమైన షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బండ్ మార్కెట్ వద్ద ఏళ్ల తరబడి శిధిలావస్థలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం జెసిబితో కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆదేశాలతో ముగ్గురు దుకాణదారులు ఇవే షాపులను ఆశ్రయించి వ్యాపారాలను నడుపుకుంటున్నప్పటికీ వారిని కాళీ చేయించి షాపులను తొలగించారు. ఈ సందర్భంగా ఆర్‌ఒ నూకరాజు మాట్లాడుతూ 8 షాపులు పూర్తిగా శిధిలం కావడంతో తొలగించినట్లు తెలిపారు.

సర్పంచ్‌ను కలిసిన ముదునూరి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని బవురువాక సర్పంచ్ దిడ్డి సత్యనారాయణను ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు బుధవారం కలిశారు. ఇటీవల కాలంలో సత్యనారాయణ భార్య మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ముదునూరి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

31న నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈనెల 31న గొల్లప్రోలు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ గండ్రెటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మహమ్మద్ అలీషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశం హాల్లో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని 24 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కార్టూ'నిజం'



యువకుని అవయవదానం

ప్రజాశక్తి - కాకినాడ

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువకుని తన అవయవాలను దానం చేసి నలుగురికి కొత్త జీవం ఇచ్చాడు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంకు చెందిన జి.మహేష్ ఈ నెల 26వ తేదీ అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం మహేష్‌ను స్థానిక మెడికవర్ హాస్పిటల్స్‌కు తరలించారు. అయితే వైద్యులు ఎంత ప్రయత్నించినా యువకుడి బ్రెయిన్ స్పందించకపోవడంతో 27వ తేదీన వైద్య బృందం యువకుడిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో యువకుని తల్లిదండ్రులు అవయవదానంపై అవగాహనతో ముందుకొచ్చి వారి కుమారుడి అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. జీవన్‌దాన్ అనుమతితో మెడికవర్ హాస్పిటల్స్‌లో అవయవ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జిజిహెచ్ ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ పి.ఫణికిరణ్ పర్యవేక్షణలో డాక్టర్ సిహెచ్.కల్యాణ్‌బాబు, డాక్టర్ రాజా అమరేంద్ర, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ అరవింద్, క్రిటికల్ కేర్ హెచ్‌ఒడి, మెడికవర్ ట్రాన్స్‌ప్లాంట్ టీమ్ సమన్వయంతో అవయవాలు సేకరించారు. సేకరించిన అవయవాలను గ్రీన్ ఛానల్ ద్వారా అవసరమైన ఆసుపత్రులకు తరలించి నలుగురికి కొత్త జీవితం అందించారు. జీవన్‌దాన్ ప్రతినిధి డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానం అనేది జీవితానికి పరమార్థం అని అన్నారు. ఒకరి జీవిత ప్రయాణం ముగిసినా ఆయన అవయవాలు మరెందరికో కొత్త శ్వాసగా మారతాయ న్నారు. ఇది కేవలం దాతృత్వం కాదని సమాజానికి అందించే అత్యంత విలువైన బహుమతి అని, మరొకరికి కొత్త జీవితం అని అన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడు తూ బ్రెయిన్ డెడ్ రోగి తిరిగి జీవించడం సాధ్యం కాదన్నారు. ఈ సందర్భంగా అవయవదానం చేయుటకు ముందు వచ్చిన ఆ కుటుంబాన్ని అభినందించారు.



సేకరించిన అవయవాలతో వైద్య బృందం

పారిశుధ్య నిర్వహణపై కౌన్సిల్ ఆగ్రహం

ప్రజాశక్తి - పిఠాపురం

పారిశుధ్య నిర్వహణపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు సోమరౌతు లలితదేవి, అల్లవరపు నగేష్ మాట్లాడుతూ శానిటేషన్ శుభ్రపరిచేందుకు పుష్కాట్లు, ట్రాక్టర్లు పనిచేయడం లేదని, దీంతో పట్టణం అంతా మురికికూపంగా మారిందన్నారు. కౌన్సిలర్ బోనాసుల శివ మాట్లాడుతూ డ్రైవర్స్ కాలనీ సమీపంలో ఆక్రమణలు అధికంగా ఉండడంతో వర్షపు నీరు రోడ్డుపై ప్రహించి ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ కాంట్రాక్టర్ దివాణంను కౌన్సిల్ ఆమోదంతో బ్లాక్ లిస్టులో పెడితే అతనకు మరల పనులు ఎలా అప్పగిస్తున్నారని ప్రశ్నించారు. కౌన్సిల్ ఆమోదించిన అభివద్ధి పనులకు టెండర్లు పిలిచి త్వరితగతన పనులు పూర్తి చేయాలని కోరారు. ఉప్పాడ బస్ స్టాండ్ సెంటర్‌లో ఉన్న చిన్నమాంబ పార్కు చుట్టూ ఆక్రమణలు అధికమయ్యాయని, ప్రయివేటు వ్యక్తుల వాటిని ఆక్రమించుకుని రోజు వారి వ్యాపారాలు సాగించే వర్తకుల నుంచి రోజుకు సుమారు రూ.500 వసూలు చేస్తున్నట్లు కౌన్సిలర్ నగేష్ ప్రస్తావించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్

నేలకొరిగిన వరి పంట

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మొంథా తుపాను వరి, అరటి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. చేతికందివచ్చిన పంట కళ్లెదుటే నాశనం అవడంతో రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏలేశ్వరం మొంథా తుపాను ప్రభావంతో మండలంలో 441 హెక్టార్లలో వరి పంట నేలకొరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మండల వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ పడిపోయిన మొక్కలను లేపి జడలుగా అల్లాలన్నారు. అనంతరం లీటరుకు 50 గ్రాముల కల్లుప్పును ద్రావణంగా తయారుచేసుకుని పిచికారి చేయాలని సూచించారు. **కోటనందూరు** మండలంలో తుపాను మెట్ట ప్రాంత రైతాంగానికి కన్నీటిని మిగిల్చింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వరద నీరు భారీగా కందవాగులోకి వచ్చి చేరింది. దీంతో కంది వాగు ఆయకట్టు కింద ఉన్న 510 ఎకరాలకు పైగా నీట మునిగిపోయింది. ఒక్కొక్క ఎకరానికి సుమారు 15 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని పాత కొట్టాం, కొత్త కొట్టాం, కెఎస్.కొత్తూరు గ్రామాలకు చెందిన రైతులు పసకడుగుల వెంకటరమణ, లక్ష్మణరావు, సన్యాసిరావు, పైల వెంకటరమణ, నూకరాజు చెప్పారు. నీట మునిగిన వరి పంటను మాజీ ఎంపిటిసి షేక్ నవాజ్ జానీ ఉనేషా, తుని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ అంకమరెడ్డి రమేష్, నాయకులు గాడి రాజబాబు, తదితరులు



గొల్లప్రోలులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పరిశీలించారు. **రౌతులపూడి** మండల వ్యాప్తంగా 300 ఎకరాలలో పత్తి, 50 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయ శాఖ అధికారి ఈశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నివేదికను రూపొందించి జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. **జగ్గంపేట** తుపాను ప్రభావంతో మండలంలో ఉద్యానవన పంటలు, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. గుర్రంపాలెం, కాట్రావులపల్లి, రామవరం గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మునగ, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. సీతానగరంలో 6.4 హెక్టార్లలో అరటి, గుర్రంపాలెంలో 14 హెక్టార్లలో బొప్పాయి, కూరగాయలు, కాట్రావులపల్లిలో 1.5 హెక్టార్లలో బంతి, కూరగాయలకు నష్టం వాటిల్లినట్టు ఉద్యానవన శాఖ అధికారి శ్రీవల్లి తెలిపారు. కాట్రావులపల్లి, సీతానగరం, రామవరం, గుర్రంపాలెం గ్రామాల్లో 216 ఎకరాల్లో వరి, 14 ఎకరాల్లో మొక్కజొన్న నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనాలు తయారుచేసినట్లు మండల వ్యవసాయాధికారి నరసింహం తెలిపారు. **గొల్లప్రోలు** మండలంలో 72 హెక్టార్లలో వరి, 32 హెక్టార్లలో మొక్కజొన్న, 18 హెక్టార్లలో అపరాలు, 190 హెక్టార్లలో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి, ఎఒ కెవిఎ.సత్యనారాయణ తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ పర్యటనలో జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్, సూరిశెట్టి శ్రీకృష్ణ, అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 25 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ అధికారి వై.రాజశేఖర్ తెలిపారు. **గండేపల్లి** మండలంలో సుమారు 848 ఎకరాల్లో వరి, మినుము పంటలు తుపాను ప్రభావంతో దెబ్బతిన్నాయని వ్యవసాయాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 156 ఎకరాల్లో మిర్చి, అరటి పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. **సామర్లకోట** మండలంలో 6204 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్టు మండల వ్యవసాయాధికారి వంగపండు మురళీధర్ తెలిపారు. మండలంలోని పిబిదేవం, వేట్లపాలెం, జిమెడపాడు, నవర, ఉండూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో జి.మేడపాడ సొసైటీ అధ్యక్షులు రవిబాబు, ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని ముచ్చిమిల్లి రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన భూర్ల చైతన్య(25)అనే యువకుడు విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. ఎలక్ట్రికల్ వర్క్ చేసే చైతన్య బుధవారం ఒక కళ్యాణ మండపం లో పనిచేస్తూ ఇనుప స్టూలు తీసుకుని వెళుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు స్టూలుకు తగిలి విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. వెంటనే అతనిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అవివాహితుడైన చైతన్య కు తల్లితండ్రులు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో ప్రయివేటు ఎలక్ట్రిషియన్ మృతి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి గ్రామంలో మొంథా తుపాను కారణంగా ధ్వంసం అయిన విద్యుత్ పునరుద్దరణ పనుల్లో విషాదం నెలకొంది. సఖినేటిపల్లి లైన్మెన్ వద్ద ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్న సఖినేటిపల్లి గ్రామానికి చెందిన యడ్ల శంకర్ (44) ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ గురై మృతి చెందారు. సఖినేటిపల్లి సిఎంఎల్ జూనియర్ కళాశాల వద్ద విద్యుత్ స్థంభంపై మరమ్మతులు చేస్తుండగా, సఖినేటిపల్లి సబ్ స్టేషన్ విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యుత్ సరఫరా చేయడంతో మరమ్మతుల 11 కెవి విద్యుత్ లైన్ నేరుగా షాక్ తగిలింది. దీంతో మరమ్మతులు చేస్తున్న శంకర్ కరెంట్ స్తంభంపై నుంచి కిందపడిపోయాడు. అతనిని ఆసుపత్రికి తీసుకువెళ్తుంటే మార్గం మధ్యలో మతి చెందినట్లు తెలుస్తుంది. మృతుడు శంకర్ కు భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. గతంలో ఇదే విద్యుత్ స్తంభం పై ఒక ప్రయివేట్ ఎలక్ట్రిషియన్ ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలుపుతున్నారు. దీనిపై తమకు ఏ విధమైన ఫిర్యాదులు అందలేదని సఖినేటిపల్లి పోలీసులు తెలుపుతున్నారు.

గడ్డి మందు చల్లాడంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి - కరప

మండలంలోని యండమూరు గ్రామంలో పంటపొలాలకు గడ్డిమందును చల్లాడంటూ గుత్తుల సత్యనారాయణపై పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ గడ్డి మందు వల్ల సుమారు అర ఎకరంలో పంట నాశనం అయిందని, ఇందుకు కారకుడైన సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు పితాని సత్తిబాబు, వనుం పహల్ బాబా, విత్తనాల రాంబాబు, వాసంశెట్టి శ్రీను, వనుం విష్ణుమూర్తి, రెడ్డి శ్రీను, పలివెల నాగేశ్వరరావు,పెసలు చంటి ఉన్నారు.

పలు గ్రామాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, రౌతులపూడి

తుపాను ప్రభావిత గ్రామాల్లో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ బుధవారం పరామర్శించారు. ప్రత్తిపాడు మండలంలోని ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, వెంకటనగరం, యుజె.పురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. తుపాను తాకిడితో దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ పర్యటనలో జనసేన నాయకులు పాల్గొన్నారు.అలాగే రౌతులపూడి మండలంలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పర్యటించారు. రౌతులపూడి గ్రామ శివారు తూర్పు మధుము గట్టు, మల్లంపేట వెళ్లే రహదారి మధ్యలో ఉన్న ఏలేరు వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు పర్వత సురేష్, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, కత్తిపూడి బుచ్చి సీతయ్యమ్మ మహారాణి సత్రం ఛైర్మన్ శ్రీసోమరౌతు చంద్రమౌళి, మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు, తహశీల్దార్ నరేష్, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు : ఎంఎల్ఎ

కరప : తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. బుధవారం మండలంలోని ఆరట్లకట్ట గ్రామంలో మునిగిపోయిన వరిపొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ బాబురావు, మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్రగడ రమేష్, సొసైటీ ప్రెసిడెంట్ గంటా వీరన్న చౌదరి, పవన్, గోన అంజి, నక్కా బ్రహ్మాజీ, శాఖ వంశి, పుల్లయ్య ప్రసాద్ పాల్గొన్నారు.



ఎన్‌డిఆర్ఎఫ్ అపరేషన్లో పాల్గొన్న ఎంఎల్‌సి పద్మశ్రీ

గల్లంతైన యువకుని కోసం గాలింపు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని దుమ్ముల పేటకు చెందిన గద్దేపల్లి సాయిరామ్ మంగళవారం కుంభాభిషేకం రేవు వద్ద సముద్రంలో గల్లంతయ్యాడు. యువకుని కోసం ఎన్‌డిఆర్ఎఫ్ బృందం బుధవారం గాలింపు చర్యలు చేపట్టాయి. ఎన్‌డిఆర్ఎఫ్ బృందంతో కలిసి ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ రెస్క్యూ ఆపరేషన్లో పాల్గొన్నారు.

గట్టు పటిష్టతకు చర్యలు

యు.కొత్తపల్లి : ఎండపల్లి కండి కాలువ గట్టుకు గండి పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తూర్పు డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ మొరాలశెట్టి సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం 400 ఇసుక బస్తాలును ఏర్పాటుచేసి గట్టు దగ్గర వేయించడం జరిగిందన్నారు. తుపాను ప్రభావంతో వరద నీరు అధికంగా రావడంతో కాలువకు గండి పడుతుందనే అంచనాతో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పంటలను పరిశీలించిన ఎంపీ

గొల్లప్రోలు : మండలంలోని దుర్గాడలో నేల కొరిగిన అరటి తోటలను ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి పరిశీలించారు. వారు మాట్లాడుతూ తుపాను వల్ల జరిగిన నష్టాన్ని తక్షణమే నివేదికను తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ రామ్‌కుమార్, ఎంపిడిఒ సెలట్ రాజు, ఉద్యానవన శాఖ అధికారి వై.రాజశేఖర్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఉన్నారు.

ధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 31న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు కోరారు. బుధవారం మండలంలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంట్ గ్రామంలో ధర్నాకు సంబంధించి కరపత్రాల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి సంవత్సరం కౌలు రైతులకు పంట పెట్టుబడి సాయం కింద రూ.13 వేలు గత ప్రభుత్వం ఇచ్చిందని, కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో రైతులు, కౌలు రైతులు పాల్గొని జయప్రదం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పితాని సత్యనారా యణ, మేడిశెట్టి శ్రీను, మేడిశెట్టి ఏడుకొండలు, ఉమాశంకర్, దంగేటి నాగేశ్వరరావు, పిల్లి శ్రీను, సూరంపూడి సూరిబాబు పాల్గొన్నారు.

జీతాలు పెంపుదల చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో శానిటేషన్ వర్కర్స్‌కు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని శానిటేషన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కాంట్రాక్ట్ క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి బి.గంగరాజు, జిజిహెచ్ సూపరింటెండెంట్‌కు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కోకన్వీనర్ వీరబాబు మాట్లాడుతూ గతంలో సూపరింటెండెంట్‌కి వినతి పత్రం ఇచ్చామని, ఏజెన్సీతో చర్చించి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారని అన్నారు. ఐదు దఫాలు చర్చలు జరిగినా వేతనాల విషయంలో కాంట్రాక్ట్ సంస్థ ప్రతిపాదనకు, కార్మికులకు అంగీకారం కుదరలేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ సంస్థ కార్మికులతో సానుకూలంగా చర్చించి డిమాండ్స్ పరిష్క రించాలని కోరుతున్నామన్నారు. యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 31వ తేదీ లోపు కార్మిక యూనియన్‌తో కాంట్రాక్టర్ చర్చలు పూర్తిచేసి, రాతపూర్వక ఒప్పందం చేసుకోవాలని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో నవంబర్ 3 వ తేదీ ఉదయం నుంచి ఎమర్జెన్సీలు మినహాయించి మిగిలిన విభాగాలలో విధులు బహిష్కరించి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, యూనియన్ నాయకులు జె. శేషు, ఆర్.రమేష్ , ఎస్.వాసు, వివిఎన్.కుమార్, డి.దుర్గాప్రసాద్, బి. మంగతాయారు, ఎం.కుమారి పాల్గొన్నారు.

ఎంపీ తీరుపై మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ పర్యటనకు వచ్చిన ఎంపి తంగెళ్ళ ఉదయశ్రీనివాస్‌కు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఉన్న ఉప్పాడ నాయక్ కాలనీకి చెందిన మత్స్యకారులు బుధవారం ఎదురు చూశారు. అయితే ఆయన కారు ఆపకుండా వెళ్లిపోవడంతో బీచ్ రోడ్డుపై మత్స్యకారులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ కొత్తపట్నం పరిసర ప్రాంతాల్లో బుధవారం పర్యటనకు వచ్చిన ఎంపికి తమ సమస్యలు చెప్పుకునేందుకు బీచ్ రోడ్డుకి ఇరువైపులా ఉన్నామని, అయితే ఎంపి కారు ఆపకుండా వెళ్లిపోవడాన్ని తప్పుబట్టారు. తమ వద్దకు ఎంపి రావాలంటూ నినాదాలు చేశారు.

చొల్లంగిలో రైతుల ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

పంట పొలాల నుంచి మురుగు నీరు వెళ్లే కాలువను యథాతదంగా ఉంచాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నాకు దిగారు. బుధవారం టిడిపి మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో చొల్లంగి డంపింగ్ యార్డ్ ప్రాంతంలో ఉన్న లేఔట్ వద్ద రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కట్టా త్రిమూర్తులు, స్థానిక రైతులు వెంట్రు వెంకట రమణ, నిమ్మగడ్డ వీరభద్రరావు మాట్లాడారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రహరీ గోడ తొలగించి యథాతథంగా కాలువ ద్వారా మురుగునీరు పోయేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కందెల్ల గోవిందు, స్వర్ణ వీరబాబు, వెంట్రు రామకష్ణ, వెంకన్న, కోట రామస్వామి, గొల్ల సత్యనారాయణ, గండి ఆంజనేయులు, బొబ్బర సత్యనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామంలో తుపానుతో నేలకొరిగిన బొప్పాయి, అరటి, కూరగాయ పంటలు, బంతి, పత్తి తోటలను నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వంగా గీత బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ పర్యటనలో జడ్‌పిటిసి ఉలవకాయల నాగలావరాజు, రైతులు ఆకుల వెంకటరాజు, నానాజీ పాల్గొన్నారు.

నెల వాయిదా మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

తుపాను బాధిత కుటంబాలకు డాక్రా అప్పులో నవంబర్ నెల వాయిదాను మినహాయించాలని ఐద్వా డిమాండ్ చేసింది. బుధవారం పగడాలపేట, ఉప్పలంక గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఐద్వా బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, జిల్లా అధ్యక్షురాలు జి.భూలక్ష్మి మాట్లాడారు. తుపాను నష్టం ఎక్కువగా మత్స్యకార కుటుంబాల్లో, రైతు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఉంటుందని అన్నారు. ప్రభుత్వం వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబర్ నెల డ్వాక్రా అప్పు చెల్లించలేరని అందుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కనీసం దాచుకున్న పొదుపు డబ్బులు నుంచి తీసుకోవడానికి బ్యాంకు అధికారులు అభ్యంతరం చెబుతున్నారని, అందుకే బయట అప్పులు చేయాల్సివస్తుందన్నారు. బ్యాంక్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, వెంకటలక్ష్మి, ఉమా పాల్గొన్నారు.

ఐవిఎఫ్ కమిటీ ఛైర్మన్‌గా గాంధీ

ప్రజాశక్తి - శంఖవరం



పేరూరి గాంధీ

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్)ఆధ్యాత్మిక కమిటీ ఛైర్మన్‌గా పేరూరి గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు బుధవారం ప్రకటించారు. ప్రస్తుతం అన్నవరం వాసవీ కన్యకా పరమేశ్వరి నిత్య అన్నదాన సత్రం అధ్యక్షులుగా గాంధీ సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐవిఎఫ్ సంస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు గ్రామస్తులు, దేవస్థానం ఉద్యోగులు, వాసవి, వనిత క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నష్టపోయిన ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. వైసిపి పాలనలో రైతులకు ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించి ఆదుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

రైతులను ఆదుకునేందుకు కృషి

ప్రజాశక్తి - పెదపూడి

తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో పంట నష్టం అంచనాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 10,496 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగిందన్నారు. పంట నష్టం నివేదికలను సిఎం దృష్టి దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కొవ్వూరి నరేంద్రరెడ్డి, అనపర్తి ఎఎంసి ఛైర్మన్ జుత్తుక సూర్యకుమారి, వ్యవసాయశాఖ ఎడిఎ దుర్గాలక్ష్మి, పిఎసిఎస్ ఛైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ రావాడ నాగు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ టి. రఘునాథరావు హెచ్చరించారు. బుధవారం రాత్రి చైతన్య స్కూల్ సమీప గ్రౌండ్లోను, డిగ్రీ కళాశాల, కాపు కళ్యాణ మండపం పరిసరాల్లో మద్యం సేవిస్తున్న పలువురుని అదుపులోకి తీసుకుని వారిపై కేసుల నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచడం జరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఖఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గౌరీ కోనేరు కాలనీలో పర్యటించిన చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక గౌరీ కోనేరు కాలనీలో బుధవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ రీజనింగ్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

జనవిజ్ఞాన వేదిక, యుటిఎఫ్ సంయుక్తంగా రూపొందించిన ఎన్‌ఎంఎంఎస్ రీజనింగ్ పుస్తకాన్ని బుధవారం డిఇఒ పి.రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్.వర్మ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి కె.లక్ష్మణరావు ఎన్‌ఎంఎంఎస్ మెంటల్ ఎబిలిటీ టెస్ట్ స్టడీ మెటీరియల్‌ను తయారు చేశారని అన్నారు. డిఇఒ రమేష్ యుటిఎఫ్, జెవివి కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎంఎం.ప్రసాద్, వర్మ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సూరిబాబు, కె.నగేష్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.ప్రభాకరవర్మ, యుటిఎఫ్. ఆడిట్ కమిటీ కన్వీనర్ రాజబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్‌వి.పద్మావతి పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోకు రూ.25 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - సామర్లకోట

తుపాను ప్రభావంతో విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు సామర్లకోట ట్రాన్స్‌కో ఎడిఇ ఎల్ఎల్ఎన్.కిరణ్ చెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారీ ఈదురు గాలులకు సామర్లకోట, పెద్దాపురం సబ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 30 కరెంటు స్తంభాలు విరిగిపడగా, ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు చెప్పారు. అలాగే నాలుగు కిలోమీటర్ల మేర 11 కెవి వైర్ ధ్వంసం అయిందన్నారు.

రోగులకు పండ్లు అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రయివేట్ ఆసుపత్రిలోని రోగులకు జనసేన పార్టీ నేతలు బుధవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌సి కొణిదెల నాగేంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఏలేరు వరద ఉధృతి పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

ఏలేరు వరద ఉధృతిని ఏలేరు పరీవాహక ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు బుధవారం పరిశీలించారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి మిగులు జలాలు దిగువకు విడుదల చేయడంతో సామర్లకోట వద్ద ఏలేరు కాలువలో నీటి ఉధృతి పెరిగింది. స్థానిక పెద్ద ఏరు వంతెన వద్ద ఆయన వరద నీటి ఉధృతిని పరిశీలించారు. ఏలేరు జలాలు కాపవరం వైపునకు వెళ్ళే కాలువను, వెంకటకృష్ణ రాయపురం, మాధవపట్నం గ్రామాల వైపు వెళ్ళే కాలువను ఆయన నిశితంగా పరిశీలించారు. వరద ఉధృతి తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు, కాండ్రకోట గ్రామాలలో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాలను టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిరాశ్రయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఎస్ఐ వి.మౌనిక, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ కుటుంబానికి పరామర్శ


ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట గ్రామపంచాయతీ వార్డు మెంబర్ కోడూరి సత్యనారాయణ కుటుంబాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ బుధవారం పరామర్శించారు. సత్యనారాయణ తండ్రి వెంకట్రావు ఇటీవలే మరణించారు. ఈ సందర్భంగా వెంకట్రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

యానాం వార్తలు

ప్రతీ రేషన్ కార్డుకు రూ.5 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - యానాం



మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

మొంథా తుపాను కారణంగా ప్రతీ రేషన్ కార్డుకి రూ.5 వేలు చొప్పున పరిహారం అందజేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ఓల్డ్ ఏజ్ హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొంథా తుపాను ప్రభావంతో నియోజకవర్గంలో ఏర్పడిన నష్టాన్ని ఎప్పటికప్పుడు సిఎం రంగస్వామికి వివరించినట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు ధ్వంసం అయ్యాయని, వాటి నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. వరి, పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రతి రేషన్ కార్డ్‌కి రూ.5 వేలు తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టానికి సంబంధించిన నివేదికలను సిఎం రంగస్వామి, గవర్నర్ కైలాసనాథన్, చీఫ్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, పిడబ్ల్యూడి మినిస్టర్ లక్ష్మీనారాయణన్, వివిధ శాఖల అధికారులకు పంపినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో పుదుచ్చేరి వెళ్లి తుపాను నష్టాన్ని అధికారులకు వివరిస్తానని చెప్పారు. తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సమర్థవంతంగా పని చేశారని కొనియాడారు. తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న ప్రజలకు, పునరావస కేంద్రంలో ఉన్న వారికి ప్రభుత్వ అన్నపూర్ణాలయం ద్వారా భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందని, యానాం ఓల్డ్ ఏజ్ హోం ద్వారా సుమారు 12 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశామన్నారు.



ఆర్థిక కార్యదర్శికి పంట నష్టాన్ని వివరిస్తున్న ఎంఎల్ఎ గొల్లపల్లి

యానాంలో ఆర్థిక కార్యదర్శి పర్యటన

ప్రజాశక్తి - యానాం

తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు పుదుచ్చేరి ఆర్థిక కార్యదర్శి కృష్ణమోహన్ బుధవారం యానాంలో పర్యటించారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. కనకాలపేట, మెట్టకూరు, దరియాలతిప్పు, ఫరంపేట, సావిత్రినగర్ గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడారు. వరి పంటలకు సంబంధించిన సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అశోక్ మాట్లాడుతూ తుపాను నష్టపరిహారంగా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ప్రతి రేషన్ కార్డుకు ఇవ్వాలని, మత్స్యకారులను, రైతులను ఆదుకోవాలని, నష్టాలపై వివరించి నివేదికను ఆర్థిక కార్యదర్శి కృష్ణమోహన్‌కు ఎంఎల్ఎ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ అంకిత్‌కుమార్, సైక్లోన్ ప్రత్యేక అధికారి అమన్‌శర్మ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్వాములకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రాంతం నుంచి అయ్యప్ప స్వామి మాల ధరించి సైకిల్ యాత్రపై శబరిమల ఆలయం వద్దకు వెళ్లే స్వాములకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిది మల్లాడి కృష్ణారావు సైకిళ్లను పంపిణీ చేశారు. బుధవారం ఓల్డ్ ఏజ్ హోం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రూ.40 వేలు విలువ చేసే 5 సైకిళ్లను స్వాములకు అందజేశారు.

IN THE COURT OF HON'BLE VII Addl JUNIOR CIVIL JUDGE:KAKINADA
O.S.NO.310/2025

Between:-
State Bank of India Retail Assets, Small & Medium Enterprises Center,Kakinada represented by its Manager ...Plaintiff
And
Aadya Aqua Enterprises rep by its Proprietor Vardhanapu Praveena ...Defendant
Aadya Aqua Enterprises rep by its Proprietor Vardhanapu Praveena, W/o Ashok Reddy, aged 34 years, Business, D.No.24-6-9, Geddam Vari Street, Kakinada, Kakinada District.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **ది.14-11-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గం॥10.30ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించ బడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.V. లక్ష్మాజిరావు(వేణు)
అడ్వకేట్, కాకినాడ
సెల్.9866211196

In the Court of the 5th Addl. Civil Judge (Junior Division), Kakinada
I.A. No. 382/2025 in O.S. No. 412/2025
Between:
Malladi Kasubabu and Others ...*Plaintiffs*
AND
Karri China Kasubabu and Others ...*Defendants*
R-1: Karri China Kasubabu, S/o. (late) Subbarao, aged 46 yrs, Business, D.No. 58-4-12, Goleelapeta, Jagannaickpur, Kakinada
R-2: Karri Pedakasu Babu, S/o. (late) Subbarao, aged 51 yrs, Business, D.No. 58-4-12, Goleelapeta, Jagannaickpur, Kakinada.
R-4: Danduprolu Kasi Ratnam, W/o. Satyanandam, aged 34 yrs, House wife, D.No. 1-172, Gadimoga, Polekurru (V), Tallarevu (M).
R-5: Chekka Eswari, W/o. Raju, aged 31 yrs, House wife, D.No. 58-4-12, Goleelapeta, Jagannaickpur, Kakinada.
పై నెంబరు కేసులో మీకెన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక తప్పించుకు తిరుగుతున్నారు. మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది. 27-11-2025వ తేదీ వాయిదా వేసియున్నారు. **ది. 27-11-2025వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు R1, R2, R4, R5 హాజరు కావలెను. అట్లు మీరు హాజరు కానిచో Exparty అగుదురు.
A.V.CH.S.S.MURTHY
Smt. A.SATYAVATHI
A.SIDHVI RAMANA KASHYAP
Advocates, D.No. 67-3-13/A, Ashok Nagar, Kakinada
Cell: 9848338335

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కాకినాడ
I.A.252/2025, I.A.No.253/2025 in O.S.44/2025
Between:
వెంగళదాసు గౌరీశంకరరావు
..పిటీషనర్ / ప్లెయింటిఫ్
మరియు
కసిరెడ్డి సీతామహాలక్ష్మి, వగైరాలు
...రెస్పాండెంట్లు / డిఫెండెంట్లు
R_3 : కసిరెడ్డి సాయిదుర్గా మణిబాబు, S/o. శ్రీను, C/o. కాటంశెట్టి శ్రీరామరావు, బడిలంక, టుటుకూరు పంచాయితీ - 533247, మామిడికుదురు మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
పై దావాలో I.A.No.252/2025 లో మరియు I.A.No.253/2025 పిటీషన్ లోనూ మిమ్మల్ని వారసుడుగా చేర్చమనే పిటీషన్ లోనూ కూడా మీరు 3వ రెస్పాండెంట్/3వ ప్రతివాది అయ్యివున్నారు. శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన I.A.No.252/2025 మరియు I.A.No. 253/2025 పిటీషన్‌లు **ది. 24-11-2025వ సం॥ తేదీన వాయిదా అయ్యివున్నది.** కావున పై తేదిన పైన తెలిపిన కోర్టులో మీరు **ఉదయం గం. 10.30 ని॥లకు** హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల పైన తెలిపిన పిటీషన్లు మీ పరోక్షమున తీర్మానము చేయబడుననియు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
కాకినాడ. #12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
ది.29-10-2025 Cell: 9848314081

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
I.A.No.921/2023 in O.S.No.8/2020
Between:
కాకరాపల్లి వీరయమ్మ, వగైరాలు
...పిటీషనర్స్ / ప్లెయింటిఫ్స్
మరియు
చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, వారి తరపు ప్రతినిధి, సెక్రటర్, శీలం రామచంద్రరావు, వగైరాలు.
...రెస్పాండెంట్లు / డిఫెన్‌డెంట్లు
R_3 : చపిడి సృజన, W/o. ఉమాశంకర, హిందూ, వయస్సు 33 సం॥లు, డో.నెం. 1-196, మల్లేపల్లి గ్రామం, గండేపల్లి మండలం, తూ॥గో॥జిల్లా.
R_5 : బొత్స యశోద, W/o. ధనాల ఈశ్వరరావు, హిందూ, 3వ ఎపియస్‌పి, ఈశ్వర్‌నగర్, కాకినాడ, C/o.చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, డోర్.నెం. 69-1-29/12/6, దేవినగర్, రోడ్ నెం.1, న్యూ గైగోలుపాడు, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_6 : కొచ్చర్లకోట సుబ్బలక్ష్మి, W/o.కొచ్చర్లకోట శ్రీరామ్ హనుమంతరావు, C/o.చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, డోర్.నెం.69-1-29/12/6, దేవినగర్, రోడ్ నెం.1, న్యూ గైగోలుపాడు, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_{10}: ఇల్ల వీరవెంకట సత్యన్నారాయణమూర్తి, S/o. ఇల్ల శ్రీరాములు, C/o.చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, డోర్.నెం.69-1-29/12/6, దేవినగర్, రోడ్ నెం.1, న్యూ గైగోలుపాడు, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_{13} : తలమంచి ఉమాపార్వతీ, W/o. తలమంచి బాలచంద్ర ప్రతాప్, C/o.చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, డోర్.నెం.69-1-29/12/6, దేవినగర్, రోడ్ నెం.1, న్యూ గైగోలుపాడు, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_{14} : రెడ్డి అమర్‌గోపి రామనాథ్, S/o. రెడ్డి లక్ష్మణరావు (లేటు), హిందూ, వయస్సు 35 సం॥లు, డోర్.నెం.7-5-18, రామారావుపేట, కాకినాడ, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_{15} : కొండపల్లి శివరామ్‌కుమార్, S/o. కొండపల్లి కాళిదాసు, డోర్.నెం.72-22-2, మాధురినివాస్, ఆర్‌సిఎన్‌ఎఫ్ క్వార్టర్స్, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం J.C.J.C.J. తూ॥గో॥జిల్లా.
R_{16} : మల్లిపూడి లక్ష్మీమాణిక్యాంబ, W/o. మల్లిపూడి లక్ష్మణమూర్తి, C/o.చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, డోర్.నెం. 69-1-29/12/6, దేవినగర్, రోడ్ నెం.1, న్యూ గైగోలుపాడు, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_{17} : బుద్దరాజు సరస్వతి, W/o. బుద్దరాజు రామకృష్ణరాజు, C/o.చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, డోర్.నెం.69-1-29/12/6, దేవినగర్, రోడ్ నెం.1, న్యూ గైగోలుపాడు, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_{23} : పక్కుర్తి అప్పలరాజు, W/o. పక్కుర్తి గోవిందరావు, హిందూ, ఆంజనేయస్వామి టెంపుల్ వీధి, తుని, తుని మండలం, కాకినాడ జిల్లా. C/o. చక్రధర్ నగర్ హౌస్ సైట్ ఓనర్ల వెల్ఫేర్ అసోసియేషన్, పెనుమర్తి గ్రామం, డోర్.నెం.69-1-29/12/6, దేవినగర్, రోడ్ నెం.1, న్యూ గైగోలుపాడు, కాకినాడ అర్బన్ మండలం, కాకినాడ J.C.J.J.
R_{24} : ఉదత సరోజిని, W/o.సిహెచ్. సత్యన్నారాయణ, హిందూ, వయస్సు 71 సం॥లు, ఫ్లాట్ నెం.301, గణేష్ సిరి సంపద అపార్ట్‌మెంట్స్, శ్రీనివాస్ కొలనీ, హైదరాబాద్.
R_{25} : రెడ్డి తిలక్ బాబు, S/o. రెడ్డి లక్ష్మణరావు (లేటు), హిందూ, వయస్సు 26 సం॥లు, డోర్.నెం. 7-5-18/GF6, ఆర్‌జెజి రెసిడెన్సీ, పశువుల హాస్పిటల్ వీధి, రామారావుపేట, కాకినాడ, కాకినాడ జిల్లా.
R_{35} : వడ్డి కాంతశ్రీ, W/o. మణికుమార్, హిందూ, వయస్సు 47 సం॥లు, డోర్.నెం.70-15-2/6B శాస్త్రినగర్, మూడుగుళ్ళ సెంటర్, గొడారిగుంట, కాకినాడ. కాకినాడ అర్బన్.
పైన తెలిపిన దావాలో I.A.No. 921/2023 లో మిమ్మల్ని పార్టీలుగా చేర్చమనే మరియు సవరణ చేయమనే పిటీషన్ లోనూ మీరు $R_3, R_5, R_6, R_{10}, R_{13}, R_{14}, R_{15}, R_{16}, R_{17}, R_{23}, R_{24}, R_{25}$ మరియు R_{35} రెస్పాండెంట్లు అయ్యివున్నారు, శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన పిటీషన్ **ది.17-11-2025 సం॥ తేదిన** వాయిదా అయ్యివున్నది. కావున మీరు పై తేదిన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం.10.30ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పైన తెలిపిన పిటీషన్ మీ పరోక్షమున తీర్మానము చేయబడుననియు ఇందుమూలముగా తెలియపరచటమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081